

కథా కౌముది

# క్షమించు నాన్నా! ఉమా మహేష్ ఆచాళ్ళ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"సర్, ఎం.డి గారు మిమ్మల్ని రమ్మంటున్నారు" పిలిచాడు అటెండర్. అకౌంట్స్ సెక్షన్ లో బిల్స్ చూస్తున్న ధరణి వెంటనే లేచి బిల్స్ ఎగిరిపోకుండా పేపర్ వెయిట్ పెట్టి ఎం.డి. గారి రూమ్ వైపు వెళ్ళాడు. తలుపు కొట్టి నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు. ముప్పై ఏళ్ళుంటాయి అతనికి. కానీ కళ్ళల్లో ఎంతో ప్రశాంతత వయసుకు మించిన పరిణతి కనిపిస్తోంది.

"రండి సర్ కూర్చోండి" అన్నాడు ఎమ్.డి కిరణ్. తన కింద పనిచేసే వాళ్లకి కూడా అతను ఇచ్చే మర్యాదని చూస్తే తెలుస్తుంది అంత పెద్ద బాధ్యత అంత చిన్న వయసులో ఎందుకు అప్పజెప్పారో.

"చెప్పండి బాబూ!" అన్నాడు ధరణి.

" సర్, మీరు ఈ కంపెనీ లో దాదాపు ముప్పై ఏళ్లుగా పనిచేస్తున్నారు. నాన్నగారు ఎప్పుడూ మీ గురుంచే చెప్తూ ఉంటారు. ఏదైనా సందేహాలుంటే మిమ్మల్నే అడగమంటారు" అన్నాడు నవ్వుతూ.

"అదంతా ఆయన అభిమానం బాబు , నాన్నగారు ఎలా ఉన్నారు?" అడిగాడు ధరణి.

"బాగానే ఉన్నారు. ఆమధ్య వచ్చిన గుండెపోటు తర్వాత పూర్తిగా ఇంటిదగ్గిరే ఉంటున్నారు కదా.. అందుకే ఇవన్నీ నేను చూసుకుంటున్నాను. మీలాంటి వాళ్ళ సహాయంతో నెమ్మదిగా పని నేర్చుకుంటున్నాను. " అన్నాడు హుందాగా.

"అదేంలేదు బాబు, మీరు నాన్నగారి లాగే మీరూ చాలా వేగంగా అన్నీ గ్రహిస్తారు , కార్మికుల కష్టాలతో సహా. అందుకే ఎప్పుడూ లాక్ అవుట్ లేకుండా నడుస్తోంది ఫ్యాక్టరీ " అన్నాడు ధరణి. నెమ్మదిగా నవ్వి తిరిగి చెప్పటం మొదలు పెట్టాడు కిరణ్ :

"అంకుల్, మీకు తెలుసుకదా, మన ఫెర్రో అల్లాయ్ ఫ్యాక్టరీ ఈ మధ్య కాలంలో నష్టాల్లో నడుస్తోంది. దీనికి ప్రధాన కారణం విద్యుత్ సరఫరా కొరత, చార్జీలు ఎక్కువగా ఉండటం. అందుకే ఈ ఏడాది బోనస్ కూడా ఇవ్వలేదు. నాన్నగారి కోరిక మీద లాక్ అవుట్ లేకుండా నడుపుతున్నాము". అన్నాడు కిరణ్

ఇవన్నీ నాకెందుకు చెబుతున్నారా అనుకుంటూ తల ఊపాడు ధరణి. ఇంతలో టీ వచ్చింది. టీ తాగుతూ చెప్పడం మొదలు పెట్టాడు కిరణ్

"అందుకే నాన్నగారితో మాట్లాడి ఒక ఆలోచన ప్రతిపాదించాను. బ్యాంకులు కూడా ఋణం ఇవ్వడానికి ఒప్పుకున్నాయి. అదేంటంటే మనమే సొంతంగా ఒక చిన్న పవర్ ప్లాంట్ (క్యాప్టివ్ పవర్ ప్లాంట్) పెడదామనుకుంటున్నాము. దీనివల్ల మనకి విద్యుత్ సరఫరా సమస్య ఉండదు. ఫ్యాక్టరీ నిరంతరం నడుస్తూ ఉంటుంది. ఉత్పత్తి బాగా పెరుగుతుంది." చెప్పాడు కిరణ్.

"చాలా మంచి ఆలోచన బాబూ. మా అందరికి కూడా చాలా సంతోషకరమైన వార్త ఇది" ఆనందంగా చెప్పాడు ధరణి.

"కానీ అంకుల్", నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టాడు. "దీనికి కొంత భూమి కావాల్సి వస్తుంది. మన ఫ్యాక్టరీ కి ఆనుకొని మీ భూమి కొంత ఉందట కదా. నాన్నగారు చెప్పారు. ఈ ఫ్యాక్టరీ కట్టేటప్పుడు కూడా మీరు కొంత భూమి ఇచ్చారుట. అందుచేత నాన్నగారు సెంటిమెంటల్ గా ఈ పవర్ ప్లాంట్ కి కూడా మీరు మీ భూమి ఇస్తే మనం పని మొదలు పెట్టొచ్చు అన్నారు. మీకు మార్కెట్ రేటు కంటే ఎక్కువ మొత్తమే ఇమ్మని నాన్నగారు చెప్పారు . మీక్కూడా ఆ డబ్బు బ్యాంకు లో వేసుకుంటే మంచి వడ్డీ వస్తుంది. మీ రిటైర్మెంట్ తర్వాత ఉపయోగ పడుతుంది. పైగా ఆ పొలంలో ఏ పంట వేసినా పెద్దగా లాభాలు రావట్లేదని మీరు ఎవరితోనో చెప్పగా విన్నాను. మీరు ఓకే అంటే మిగతా పనులు మొదలు పెడతాము. ఏమంటారు?" అన్నాడు కిరణ్.

అప్పటివరకు ఎంతో ఉషారుగా ఉన్న ధరణికి ఒక్కసారి ఏదో తెలియని ఆందోళన. అతనికి ఆ క్షణం అమ్మ గుర్తుకు వచ్చింది. నాన్న చిన్నప్పుడే పోతే అమ్మ ఆ పొలాన్ని సాకిన తీరు గుర్తొచ్చింది. రోజుకి పద్దెనిమిది గంటలు అక్కడే గడిపేది. చివరికి అక్కడే కన్ను మూసింది.

ధరణి నెమ్మదిగా బదులు చెప్పడం మొదలు పెట్టాడు.

"బాబూ!, అప్పట్లో మా అమ్మ వైద్యానికి, కూతురి పెళ్ళికి , ఇల్లు గడవక, కొంత భూమి అమ్మిన మాట నిజమే. దానికి మీ నాన్నగారు మంచి వెలకట్టి తీసుకోవడమే కాక, నాకు ఉద్యోగం కూడా ఇచ్చారు. దానికి మా కుటుంబం మొత్తం మీకు ఎప్పుడూ రుణపడి ఉంటాము. కానీ, ఈ మిగిలిన చిన్న చెక్క, మా అమ్మ గుర్తుగా ఉంచుకోవాలని నా కోరిక. అందుకే రోజూ ఒక్కసారయినా ఆ పొలమంతా తిరిగి వస్తూ ఉంటాను. దాన్ని కూడా అమ్మడమంటే కొంచెం మనసుకి కష్టంగా ఉంది. ఇక పోతే ఫలసాయం, వడ్డీలు అంటారా. మీరు ఏమీ అనుకోక పోతే ఒక్క మాట. ఈ ఫ్యాక్టరీ పై మీరు దాదాపు ఏభై కోట్లు పెట్టి ఉంటారు. ఎప్పుడూ గొప్పగా లాభాలు చూసింది లేదు. పైగా ఈ మధ్య బాగా నష్టాలు కూడా వస్తున్నాయి. అదీకాక ఇంత పెద్ద ఫ్యాక్టరీ నడపటానికి మీరు ఎన్నో తలనొప్పులు భరించాలి. అయినా మీరెప్పుడూ, ఇది అమ్మేసి ఆ వడ్డీతో హాయిగా విదేశాల్లో స్థిరపడాలని అనుకోలేదు. ఎందుకంటే వందమందికి ఉపాధి కల్పించడంలో ఉన్న ఆనందం మీకు తెలుసు. అలాగే నా భూమిలో నేను వందమందికి సరిపడా వరి పండించగలననే ఒక ఆనందం. వర్షాలు పడకో, ఎక్కువైపోయో పంట పోవటం అనేది వేరే విషయం. ఇదంతా మనలాంటి వాళ్ళని నడిపించే ఒక వ్యసనం లాంటిది. కాకపోతే ఈ మరక మంచిదంతే. మీలాగే నేను కూడా వృత్తి అంటే ఉత్పత్తి అని నమ్ముతాను బాబు. దయచేసి ఏమీ అనుకోకండి. " ముగించాడు ధరణి కొంచెం వణుకుతున్న గొంతుతో. అతని కళ్ళల్లో సన్నటి నీటి పొర.

"అయ్యో అంకుల్ మీరు అంతగా చెప్పాలా, మరేం పర్వాలేదు. నాన్నగారు మీరు ఒప్పుకుంటేనే ఈ ప్రాజెక్ట్ ముందుకు తీసుకెళ్లామన్నారు. లేదంటే వేరే ప్రత్యామ్నాయం చూద్దాం. సారీ అంకుల్" నవ్వుతూ చెప్పాడు కిరణ్.

"నన్ను అర్థం చేసుకున్నందుకు చాలా సంతోషం బాబు" అంటూ బయటకు వచ్చాడు ధరణి. అతని మనసు ఇప్పుడు చాలా తేలికగా ఉంది. సాయంత్రం ఇంటికి వెళ్తూ, ఒకసారి పొలం అంత తిరిగి, అక్కడే ఉన్న పాకలో ఒక గంట కూర్చుని ఇంటికి వచ్చాడు.

ఆ మర్నాడు ఉదయం ఆ ఫ్యాక్టరీ లో 'జూనియర్ ఎలక్ట్రికల్ ఇంజినీర్' ఉద్యోగానికి ఇంటర్వ్యూలు అవుతున్నాయి. రెండు పోస్టులకి 120 మంది ఇంజినీర్లు ఎదురు చూస్తున్నారు జీతం నెలకి 12,000/-. ఎం.డి కిరణ్ స్వయంగా ఒక్కొక్కరిని పిలిచి ఇంటర్వ్యూ చేస్తున్నాడు. తర్వాతి అభ్యర్థి వచ్చాడు. అతని బయో డేటా చూసాక, "మీరు మా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ధరణి గారి అబ్బాయా?" అడిగాడు 'రవి'ని.

"అవును సర్," వినయంగా చెప్పాడు రవి.

"నాన్నగారు ఎప్పుడూ చెప్పలేదే!?", ఆశ్చర్యం గా అడిగాడు కిరణ్.

రవి ఏమి మాట్లాడలేదు.

" ఓ.కే. మీ విద్యార్హత, మార్కులూ, చాలా సాధారణంగా ఉన్నాయి. పైగా ఎటువంటి అనుభవం లేదు. మీకు ఈ ఉద్యోగం ఎందుకు ఇవ్వాలి?" నవ్వుతూనే అడిగాడు కిరణ్.

"సర్, మా తల్లిదండ్రులతో ఇక్కడే ఉండాలని నా కోరిక. అందుచేత మీరు పొమ్మంటే తప్ప నా అంతేట నేను ఇక్కడనుంచి బయటకు పోను. ఇక ప్రతీ ఉద్యోగికీ ఉండవలసిన ముఖ్య లక్షణం నమ్మకం, అతనిపై ఆధారపడగలమనే ధీమా (డిపెండబిలిటీ). మీకు మా నాన్నగారి గురుంచి తెలుసు. మీరు జన్యు శాస్త్రాన్ని నమ్మితే, నన్ను కూడా నమ్మొచ్చు. నాతో పాటే వచ్చిన వాళ్ళకి ఇవి లేవని కాదు. కానీ నా విషయంలో ఈ అర్హతలు పరీక్షించడానికి మీ విలువైన సమయాన్ని వృధా చేయనవసరం లేదు. ఇదొక్కటే నాకున్న అదనపు అర్హత సర్." నవ్వుతూ చెప్పాడు రవి.

"గుడ్" . అన్నాడు కిరణ్. "మరొక విషయం. మీ నాన్నగారికి నేను ఒక ప్రతిపాదన చెప్పాను. దానికి ఈ సంస్థలో పనిచేయబోయే ఉద్యోగిగా, నీ వంతు ప్రయత్నం నువ్వు చెయ్యాలి" నవ్వుతూ చెప్పాడు కిరణ్. మంచితనం వేరు. వ్యాపారం వేరు.

"అవును సర్. నిన్న మా ఇంట్లో ఈ ప్రస్తావన వచ్చింది. నాన్నగారితో నేను మాట్లాడి మిమ్మల్ని కలుస్తాను." అని చెప్పి రవి బయటకి వచ్చేసాడు.

ఆరోజు రాత్రి భోజనాల దగ్గర రవి నెమ్మదిగా మొదలు పెట్టాడు.

"నాన్నా, నేను మీకు ఒక విషయం చెప్పాలి. నేను సుధ అనే అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆ అమ్మాయి చాలా మంచిది. మా విషయం తను వాళ్ళ ఇంట్లో చెప్పింది. నాకు ఉద్యోగం ఉంటే వాళ్ళకి ఎటువంటి అభ్యంతరమం లేదట. మీకు చెప్పాను కదా, ఈరోజు మన ఫ్యాక్టరీలో ఇంటర్వ్యూకి వెళ్ళాను. మన పొలం ఇస్తే నాకు ఉద్యోగం ఇచ్చేటట్టు ఉన్నారు. మీకు తెలుసుగా నాన్నా, నా సెకండ్ క్లాస్ బి.టెక్ అదికూడా ఒక చిన్న ప్రైవేట్ కాలేజీలో , చదువుకి, నాకున్న అతి సాధారణమైన తెలివికీ ఉద్యోగం రావటం ఎంత కష్టమో. నాకు తెలుసు మీకు ఆ పొలంతో ఉన్న ప్రత్యేక అనుబంధం. కానీ, కాలంతో పాటు మనం కూడా మారాలి కదా నాన్నా. పైకెగిరిన ప్రతీ వాడు క్రింద పడక తప్పదన్నాడు న్యూటన్. "మేము తప్ప" అన్నారు రైట్ సోదరులు. దానర్ధం న్యూటన్ తప్పని కాదు నాన్నా. మన భావోద్వేగాలన్నీ ప్రగతి అనే నిచ్చెనకి ఉండే మెట్లు లాంటివి. మనకి ఎంత ఉపయోగపడినా, ఒక్కో మెట్టునీ వదిలితేనే పై మెట్టుకి వెళ్ళగలం". ఒక్క క్షణం ఆగి రవి మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు.

"నువ్వు చెప్పింది కూడా నిజమే నాన్నా, ఆ భూమితో మనం వందమందికి అన్నం పెట్టగలం. కానీ, ఆ వందమందీ, కేవలం అన్నంతోనే ఉండిపోలేరు కదా. ప్రతీ దానికీ ఒక ప్రత్యామ్నాయం ఉంటుంది నాన్నా. ఒకప్పుడు ఒక్కొక్కళ్ళూ వంద గజాల స్థలంలో ఉండేవారు. ఇప్పుడు అదే స్థలంలో వందమంది ఒకరి మీద ఒకరు అంత కన్నా సౌకర్యంగా ఉంటున్నారు. అలాగే, వంద గజల్లో వందమందికి సరిపడా వరి పండించడమో, లేదా వంద గింజలతో వంద రోజులు బ్రతకగలిగే టెక్నాలజీ రావచ్చు. ఇదంతా డార్విన్ సిద్ధాంతమే. ఇవన్నీ కాకపోయినా, వాళ్ళు కూడా ఎంతో న్యాయం గానే అడుగుతున్నారు గా. వాళ్ళు కావాలంటే , ప్రభుత్వం ద్వారా మన భూమి న్యాయంగానే పొందగలరు. కానీ ఎంతో మర్యాదగా మనల్ని అడిగారు. ప్లీజ్ నాన్నా, కొంచెం ఆలోచించండి. " అన్నాడు రవి చాలా ఆర్తిగా.

ధరణికి ఏం మాట్లాడాలో తెలియలేదు. రవి చెప్పినదాంట్లో అతనికి ఏమీ తప్పు కానీ, స్వార్ధం కానీ కనపడలేదు. పైగా ఎంతో పరిణతి ఉన్న వాడిలా మాట్లాడాడు. మరీ ఇంత చిన్న విషయాన్ని తాను భూతద్దంలో చూస్తున్నానా? అనిపించింది ధరణికి ఒక్కసారిగా.

"అలాగే రవీ. దానికి నువ్వు ఇంతలా చెప్పాలా ? అది నీదే కదా. నువ్వు చెప్పినట్టే చేద్దాం. ఇక పడుకో," అన్నాడు ధరణి.

ఆ రోజూ ఆ తండ్రీ కొడుకులిద్దరికీ నిద్ర పట్టలేదు. నిద్రకి బాధా, సంతోషం రెండూ శత్రువులే కదా.

ఆ మర్నాడు రవి మొదట ఫ్యాక్టరీకి వెళ్ళి ఎం.డి ని కలిసి ఈ విషయం చెప్పాడు. ఎం.డి కిరణ్ ఆనందంగా రవికి షేక్ హ్యాండ్ ఇచ్చి, "ఓకే రవీ, ఆ పని అవగానే నువ్వు ఉద్యోగంలో చేరొచ్చు. అన్నాడు. రవి "థాంక్ యు సర్" అని బయటకి వచ్చి, నేరుగా 'సుధ'ని ఎప్పుడూ కలిసే చోట కలిసి, జరిగినదంతా చాలా ఉత్సాహంగా చెప్పాడు. తాను నాన్నని ఎంత గొప్పగా ఒప్పించిందీ చెప్పుకొచ్చాడు.

ఇంటికి వస్తూనే, అమ్మా, "నాన్న ఎక్కడమ్మా?" అడిగాడు.

"పొలానికి వెళ్లారురా" . చెప్పింది వాళ్ల అమ్మ.

"సరే అమ్మా.., నేను ఒకసారి పొలానికి వెళ్లి, నాన్నతో మాట్లాడి వస్తా" అంటూ, బయల్దేరాడు.

పొలం చేరుకునేసరికి, దూరంగా పాకలో నాన్న మడత కుర్చీలో కూర్చుని నిద్రపోతున్నారు. పక్కనే ఎప్పుడూ ఆయన వెంటే ఉండే చిన్న పుస్తకమూ, పెన్నూ. కాసేపు పోయాక లేపుదాం అనుకుంటూ, గాలికి ఎగిరిన ఆ పుస్తకాన్ని అందుకున్నాడు. అందులో బాగా పరిచయమైన నాన్న చేతి వ్రాత. తన పేరు కనబడటంతో ఉత్సాహంగా చదవటం మొదలుపెట్టాడు.

" నాన్నా రవీ, రాత్రంతా నువ్వు చెప్పిందే ఆలోచించాను. నువ్వు చెప్పింది చాలా వాస్తవంగా అనిపించింది. అందుకే ఆఖరిసారిగా చూసి పోదామని ఇలా పొలం వరకు వచ్చాను. ఇవాళ ఆదివారం కదా. రోజంతా ఇక్కడే గడిపి రేపు ఉదయం ఎం.డి. గారికి పేపర్లు ఇచ్చేద్దామనుకున్నాను. కానీ ఇక్కడికి వచ్చాక ఏదో తెలియని బాధ. నీకు తెలియదు. నా ప్రతీ పుట్టినరోజుకి మా అమ్మ నాచేత ఒక మొక్క నాటించేది. ఆలా ఎదిగినవే మన పొలంలో ఉన్న చెట్లన్నీ. అందుకేనేమో వీటికీ, నాకు ఏదో తెలియని ఒక బంధం. ఇక్కడ పూల చెట్లన్నీ నా చెల్లెళ్ళూ, పళ్ళ చెట్లన్నీ నా తమ్ముళ్లు అనే భావన.

నువ్వు చెప్పింది నిజమే. డార్విన్ చెప్పినట్టు ఈ మార్పంతా జీవ పరిణామ సిద్ధాంతంలో భాగమే. కానీ, జిరాఫీ ఆహారం అందకపోతే మెడకి ఆపరేషన్ చేయించుకోలేదు. కొన్ని వందల సంవత్సరాలు తనతో తాను పోరాటం చేసి, కొన్ని తరాలు అంతరించిన తర్వాత అది ఆలా మారింది. నేను చెప్పేదేంటంటే జీవ పరిణామానికి కూడా ఒక క్రమం ఉంటుంది. బహుశా మా తరాన్ని ఇలా వదిలేస్తే బాగుండేదేమో. నిజమే, ఒక్క ఇల్లు ఉండే చోట ఇప్పుడు వంద మంది సౌకర్యంగా ఉంటున్నారు. కానీ, అందులో ఎంతమంది రోజూ సూర్యుణ్ణి ఇంట్లో చూడగల్గుతున్నారు ? ఎంతమంది విటమిన్ 'డి' ని మాత్రల రూపంలో తీసుకోవట్లేదు ?

మా తరంలో సినిమా కేవలం మొదటి ఆట, రెండో ఆట మాత్రమే ఆడేవి. ఎందుకంటే ఉదయం నించి సాయంత్రం వరకు పూర్తిగా "పని గంటలు" అని మేం నమ్మేవాళ్లం. కానీ ఇప్పుడు, ఉదయం ఎనిమిది గంటలకు సినిమా హాల్ దగ్గర వందల మంది యువతని చూస్తూ ఉంటే మనసుకి చాలా ఇబ్బందిగా ఉంటోంది. మీ 'ప్రగతి' లో ఇవేమీ కనబడవా ? నిజమే, పారిశ్రామికీకరణ కూడా అవసరమే. చెట్లు కొట్టి ప్రగతి మెట్లుగా మారుస్తామంటే ఎలా ? మన ఫ్యాక్టరీ దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఎన్ని వందల చెట్లు నరికేసి ఉంటారు. గేట్ దగ్గర ఒక చిన్న గడ్డితో పరుచుకున్న 'లాన్' ఉంటే అది పర్యావరణహిత (ఎకో ఫ్రెండ్లీ) లేదా గ్రీన్ ఫ్యాక్టరీ అయిపోతుందా ? వంద మొక్కలు పెంచిన వారికి మాత్రమే ఫ్యాక్టరీ పెట్టే అనుమతి ఇవ్వొచ్చుగా?

నీకు తెలుసుగా . నేను ఇప్పటికీ ఒక్క జ్వరం మాత్ర కూడా వేసుకోలేదు. కళ్ళజోడు వాడను. సైకిలే తొక్కుతాను. అప్పట్లో మేం ఎక్కడ నీరు కనబడితే అక్కడ త్రాగేవాళ్ళం. ఇప్పుడు నీళ్ల బాటిళ్ళూ పెరిగాయి, సెలైన్ బాటిళ్ళూ పెరిగాయి,

నిజమే, న్యూటన్ ని కాదని మనం పైకి ఎగురుతూనే ఉన్నాం. కానీ అక్కడే ఉండిపోలేదు కదా. అక్కడ ఉండటానికీ, భూమ్మీద ఉండటానికీ చిన్న తేడా "కళ్ళు తిరగటం" అనే అసౌకర్యం. అది భరించడం మా తరం వల్ల కావట్లేదు. జయింట్ వీల్ ఎక్కడం మీకు సరదా కావచ్చు. కానీ మాకు అది ప్రాణాలు అరచేత్తో పట్టుకోవడం.

మేము మందు వేసవిలో రాత్రిపూట మంచుకి దుప్పటీలు కప్పుకునేవాళ్ళం. మీరు ఏసీలు కనిపెట్టారు. కానీ అదే ఏసీలో మీకు ఎందుకు ఉక్కపోస్తోంది. నేను ఛాందస వాదిని కాదు. నెమ్మదిగా, ప్రకృతి సహజంగా ఎదగమని మాత్రమే చెబుతున్నాను.

ఇవన్నీ నేను అన్నం పెట్టే యజమానికి కానీ, కన్న కొడుకువైన నీకు గాని చెప్పలేను.

నాకు మా అమ్మ ఎంతో, నువ్వూ అంతే. అందుకే నువ్వు అడగ్గానే వెంటనే ఒప్పుకున్నాను.

కానీ, నిన్నటి నుంచి ఎందుకో ఒకటే ఆందోళన. ఛాతీలో సన్నగా మంట. నా నుంచి నేను వేరవటం నాకు తెలుస్తోంది. అందుకే ఇదంతా. నాకు ఏదైనా అయితే నా ఉద్యోగం నీకు ఇస్తారు. నా గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్ డబ్బులు నీకే వస్తాయ్. నువ్వు ఎప్పుడూ, సంతోషం గా ఉండాలి. అమ్మ జాగ్రత్త.

నాలో పనికొచ్చే అవయవాలన్నీ దానం చెయ్యి. మిగిలిన శరీరం ఇక్కడే పూడ్చేయ్యి. దాని మీద ఒక మొక్క నాటు. ఉంటాను."

రవి కళ్ళల్లో నీళ్లు ధారల్లా కారుతున్నాయి. నాన్న మొహం నిర్మలంగా ఉంది. అమ్మ వొడిలో నిద్రపోతున్న చంటి పిల్లాడిలా. అక్కడున్న చెట్లన్నీ స్తబ్దంగా ఉన్నాయి. మౌనం పాటిస్తున్న సైనికుల్లా...★★★★

Click here to share your comments on this story